జిల్లాలో విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలి

కలెక్టర్ హరిచందన దాసరి

హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన హరిచందన దాసరిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న టీఆర్‌టీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

మలక్ పేట, జూన్ 23: హైదరాబాద్ జిల్లాలో విద్యారంగాన్ని బలోపేతం చేయాలని కలెక్టర్ హరిచందన దాసరి సూచించారు. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎస్.శ్రీనాథ్, డాక్టర్ ఎన్.విజయభాస్కర్ కలెక్టర్ హరిచందనను మర్యాద పూర్వకంగా కలిసి మెమొంటో అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, హైదరాబాద్ జిల్లాలో విద్యాభివృద్ధికి తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. విద్యారంగానికి ప్రభుత్వం ఇతోధికంగా కృషి చేస్తుందని, దానికి ఉపాధ్యాయుల సంపూర్ణ సహాయ, సహకారాలు ఎంతో అవసరమన్నారు. హైదరాబాద్ జిల్లాలో ఉత్తీర్ణత శాతం పెంచాలని ఆమె సూచించారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు నూటికి నూరు శాతం ఉత్తీర్ణతను సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.

హనుమాన్ ఆలయ ధర్మకర్తగా రాజేశ్వరి ప్రమాణ స్వీకారం

హనుమాన్ ఆలయ ధర్మకర్తగా ప్రమాణం చేస్తున్న ముద్ద రాజేశ్వరి

చంపాపేట, జూన్ 23: చంపాపేట డివిజన్ పరిధిలోని కర్మన్ ఘాట్ హనుమాన్ ఆలయ పాలక మండలి ధర్మకర్తగా ఇటీవల ముద్ద రాజేశ్వరి నియామకమయ్యారు. ఈ మేరకు ఆమె సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅతిథిగా దేవాదాయ శాఖ రంగారెడ్డి జిల్లా ఇన్‌స్పెక్టర్ ప్రణీత్ హాజరై ఆలయ ఈఓ ఎన్.లావణ్య, ఆలయ పాలకమండలి చైర్మన్ ఈదులకంటి సత్యనారాయణ రెడ్డితో కలిసి ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త రాజేశ్వరి కుమారులు మీర్ పేట మాజీ కార్పొరేటర్ ముద్ద పవన్, ఆలయ మాజీ ధర్మకర్త ముద్ద కళ్యాణ్ చక్రవర్తి, ఆలయ పాలకమండలి ధర్మకర్తలు దిండు ప్రవీణ్ గౌడ్, నారాయణ్ దుర్గారెడ్డి, తోకటి కిరణ్, పూల నాగరాజు, బండిగారి శ్రీనివాస్ గౌడ్, కంచర్ల కవిత, ఓరుగంటి నరేష్, కొండ్రు సంతోష్, సింగంశెట్టి శ్రీనివాస్, ఆలయ సిబ్బంది రమాదేవి, వెంకటయ్య, వీరేశ్, పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

క్రాంతి నగర్‌లో కాలనీవాసులు నిర్మిస్తున్న వెంకటేశ్వర ఆలయ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

చంపాపేట, జూన్ 23: చంపాపేట డివిజన్ కర్మన్ ఘాట్ క్రాంతి నగర్‌లో కాలనీవాసులు నూతనంగా నిర్మిస్తున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయానికి సహకారం అందిస్తానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. కాలనీవాసుల కోరిక మేరకు ఎమ్మెల్యే సోమవారం అక్కడికి వెళ్లి ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు గతంలో తమ కాలనీ అభివృద్ధిలో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. అదేవిధంగా తమ కాలనీకి మరికొన్ని కెమెరాలు ఏర్పాటు చేయించాలని ఎమ్మెల్యేను కోరారు. అంతేకాకుండా తాము నిర్మించుకుంటున్న ఆలయ అభివృద్ధికి సహాయ, సహకారాలు అందించాలని కోరారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి మాట్లాడుతూ, కాలనీలో మరిన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేయటంతో పాటు, ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సుంకోజు కృష్ణమాచారి, చీర శ్రీనివాస్, ఎల్బీనగర్ యువజన విభాగం అధ్యక్షుడు రవి ముదిరాజ్, చంపాపేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ముడుపు రాజ్ కుమార్ రెడ్డి, కాలనీవాసులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు స్పెషల్ డ్రైవ్

ఆజంపురా డివిజన్‌లో దోమల నిర్మూలనకు ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీసీ జయంత్, ఎంటామాలజీ సిబ్బంది

మలక్ పేట, జూన్ 23: వర్షాకాలంలో అపరిశుభ్ర పరిసరాలు దోమలు, ఈగల వృద్ధికి దోహదపడతాయని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఈగలు, దోమల వృద్ధిని నిర్మూలించ వచ్చునని మలక్ పేట సర్కిల్ -6 డిప్యూటీ కమిషనర్ జయంత్ తెలిపారు. సర్కిల్ పరిధిలోని ఆజంపురా వార్డు కార్యాలయంలో సోమవారం ఇంటింటికి తిరిగి దోమల నిర్మూలన పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలం ప్రారంభమైనందున ఈగలు, దోమల నివారణకు సర్కిల్ పరిధిలో ఫాగింగ్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మురికి నీటి గుంతలు కాలువలు, వరద నీటి కాలువలు, డ్రైనేజీ లైన్లతో పాటు మూసీ పరివాహక ప్రాంతంలో లార్వా నిర్మూలన (యాంటీ లార్వా) రసాయనాల పిచికారితో పాటు వారానికి మూడుసార్లు ఫాగింగ్ నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. వర్షాకాలంలో దోమ కాటుతో మలేరియా వంటి విష జ్వరాలు ప్రబలే ప్రమాదం పొంచి ఉన్నందున, నగర కమిషనర్ ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలో దోమల నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఎంటమాలజిస్ట్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి :ఎమ్మెల్యే

మలక్ పేట, జూన్ 23: పాత మలక్ పేట డివిజన్‌లో పెండింగ్ లో ఉన్న అన్ని అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మలక్ పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్ శాఖ, పారిశుధ్య విభాగం, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీతో కలిసి సోమవారం డివిజన్ పరిధిలోని పద్మా నగర్ కాలనీలో పర్యటించిన ఆయన, పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీ, అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ లో పడడానికి గల కారణాలను అధికారులతో విశ్లేషించారు. వర్షాకాలం ప్రారంభమైనందున వర్షాలు జోరందుకోక ముందే అన్ని పనులను పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ముంపు సమస్యలు, మురికి సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. పనులు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులు చొరవ తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రధానంగా డ్రైనేజీ మ్యాన్ హోల్ లు పొంగకుండా, వరద నీటి కాలువలు, మురికి నీటి కాలువల్లో పూడికను తొలగించి పైప్ లైన్లను క్లియర్ చేయాలని, అదే విధంగా చెత్తా, చెదారం పేరుకు పోకుండా పారిశుధ్య సక్రమంగా నిర్వహించాలని, ముంపు సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. రహదారుల నిర్మాణం కూడా వర్షాలు ప్రారంభమవ్వకముందే పూర్తి చేయాలని, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా, ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. పెండింగ్ పనులకు సంబంధించిన పూర్తి నివేదికను అందించాలని, అదేవిధంగా పనులను వెంటనే ప్రారంభించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీ జయంత్, మలక్ పేట సబ్ డివిజన్ జల మండలి డీజీఎం సయ్యద్ హస్మత్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

మండల రైతులకు 'రైతు భరోసా' కల్పించాలి

సమావేశంలో మాట్లాడుతున్న పాండు యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, తదితరులు

బడంగ్ పేట్, జూన్ 23: రంగారెడ్డి జిల్లాలో 9 మండలాలకు రైతు భరోసా ఇవ్వని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని పీఏసీఎస్ చైర్మన్, హైదరాబాద్, రంగారెడ్డి డీసీఎంఎస్ డైరెక్టర్ మంచె పాండు యాదవ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ డి.వెంకటేశ్వర రెడ్డి హెచ్చరించారు. మహేశ్వరం మండల రైతుల పక్షాన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లాలోని 9 మండలాల రైతులకు రైతు బంధు, భరోసా నిధులు మంజూరు చేస్తూ జీఓ విడుదలకు ఆదేశాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే మండల రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వకపోతే కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులను గ్రామాలలో తిరగనివ్వబోమని హెచ్చరించారు. మహేశ్వరం మండలంలో రైతులు వ్యవసాయం చేయడం లేదని, అంతా రియల్ ఎస్టేట్ వ్యాపారం నడుస్తోందని ముఖ్యమంత్రి భావించడం బాధాకరమన్నారు. వ్యవసాయం చేస్తున్న రైతులను గుర్తించి రంగారెడ్డి జిల్లాలో ఉన్న తొమ్మిది మండలాల రైతులకు రైతు భరోసా వచ్చే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి నాయకత్వంలో ఉద్యమాలను తీవ్రతరం చేస్తామన్నారు. రైతులకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుందన్నారు. ప్రభుత్వం తప్పుడు ఆలోచనలను వెనక్కి తీసుకొని నిజమైన రైతులకు రైతు భరోసా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఏ. ప్రభాకర్, మాజీ వైర్మన్ అంబయ్య యాదవ్, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

30వ తేదీ నుంచి సెల్ఫ్ తరగతులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సె ల్ట్)లో ఈ నెల 30వ తేదీ నుంచి తరగతులను నిర్వహించనున్నట్లు సెల్ఫ్ డైరెక్టర్ ప్రొఫెసర్ సవిన్ సౌడ ఒక ప్రకటనలో తెలిపారు. 'ఎ సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్ మెంట్' పేరుతో నిర్వహించే రెండు నెలల కోర్సుకు ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటల నుంచి ఏడున్నర గంటల వరకు ప్రత్యేక బ్యాచ్ ను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఇతర వివరాలకు 79899 03001 నంబర్ లో సంప్రదించాలని సూచించారు.

28న జరిగే ఎంబీఏ పరీక్షల వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ఈనెల 28న నిర్వహించనున్న ఎంబీఏ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. యూజీసీ నెట్ పరీక్ష నేపథ్యంలో ఎంబీఏ (డే) నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, రెండు, నాలుగో సెమిస్టర్ బ్యాక్లాగ్, ఇంప్రూవ్మెంట్, ఎంబీఏ (ఈవినింగ్) అన్ని సెమిస్టర్ల బ్యాక్లాగ్ పరీక్షను వాయిదా వేస్తున్నట్లు చెప్పారు. ఈ పరీక్షను తిరిగి వచ్చే నెల 9వ తేదీన నిర్వహించనున్నామన్నారు. పరీక్షా కేంద్రం సమయం లలో ఎటువంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. ఇతల వివరాలకు ఓయూ వెబ్సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

సికారా క్లినిక్స్ & ఫెమినా ప్లాంట్ స్టూడియో సెలూన్ ప్రారంభం

ప్రారంభించిన సీఇఓ కల్లెం రాఘవేందర్ రెడ్డి, సినీ నటి మానసా వారణాసి

కొత్తపేటలోని గ్రీన్ హిల్స్ కాలనీలో గల టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని సికారా క్లినిక్స్, ఫెమినా ప్లాంట్ స్టూడియో సెలూన్ 7,000+చదరపు అడుగుల స్థలంలో అత్యంత విలాసవంతమైన డ్యూయల్ ఫార్మాట్ సెంటర్ ఒకేచోట ప్రీమియం సెలూన్‌తో పాటు అత్యాధునిక డెర్మటాలజీ మరియు సౌందర్య సేవలను అందిస్తుంది. రాబోయే సంవత్సరాలలో దేశవ్యాప్తంగా 100 క్లినిక్‌లను స్థాపించే లక్ష్యంతో ఉంది అని తెలిపారు.

గ్రామదేవతల ఆలయాల్లో కుమ్మరులనే పూజారులుగా నియమించాలి

రాష్ట్ర కుమ్మర సంఘం సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నేతలు

చంపాపేట, జూన్ 23: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉండే గ్రామ దేవతల ఆలయాల్లో కుమ్మరులని పూజారులుగా నియమించాలని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నడికుడ జయంత్ రావు, మల్కాజిగిరి దయానంద్ అన్నారు. చంపాపేట్ డివిజన్ పరిధిలోని కర్మన్ ఘాట్ గాయత్రీ నగర్ చౌరస్తాలోని ఆనంద్ బంకెట్ హాల్లో సోమవారం కుమ్మర సంఘం రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జయంత్ రావు, దయానంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఉండే గ్రామ దేవతలకు నిర్వహించే బోనాల ఉత్సవాలలో ప్రతి ఒక్కరు మట్టి కుండలోనే నైవేద్యం సమర్పించుకోవాలని కోరారు. అంతేకాకుండా గ్రామదేవతల ఆలయాల్లో కుమ్మరులనే పూజారులుగా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇందులో భాగంగా కుమ్మర సంఘం ఆధ్వర్యంలో ఈనెల 26న లోయర్ ట్యాంక్ బండ్ జగదీష్ మందిర్ నుంచి, శ్రీ కనకాల కట్ట మైసమ్మ వరకు 501 బోనాలతో ఎంతో భక్తిశ్రద్ధలతో బోనాల జాతర నిర్వహించనున్నట్లు వారు తెలియజేశారు. ఇంత భారీ ఎత్తున నిర్వహించబోయే ఈ బోనాల జాతరలో రాష్ట్రవ్యాప్తంగా ఉండే మహిళలు, ప్రధానంగా కుమ్మర సామాజిక వర్గం భక్తులు భారీ ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ బోనాల మహోత్సవానికి రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఇంకా ప్రముఖ నేతలు, నాయకులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామన్ కోల్ ప్రభాకర్, కో కన్వీనర్ ఏడుకొండల వెంకటేశం, కోశాధికారి, కమిటీ సలహాదారులు రామన్ కోల్ వీరేశం, నాగపురి నాగేశ్, ఎగిరిశెట్టి వీరయ్య. రాష్ట్ర నాయకులు రాచకొండ కిష్టయ్య, కమిటీ సభ్యులు ఆడాల గణేష్, కొండాపురం శ్రావణ్ పాల్గొన్నారు.

'మహిళలు అన్ని రంగాలలో రాణించాలి'

బడంగ్ పేట్, జూన్ 23: బడంగ్ పేట్ నగర బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు మంగు రాఘవరావు ఆధ్వర్యంలో కోశాధికారి బల్లమూడి రాంబాబు, కార్యవర్గ సభ్యుల సహకారంతో అల్మాస్ గూడలోని వర్షిని ఫంక్షన్ హాల్ బ్రాహ్మణ సేవా సంఘం సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసనమండలి సభ్యురాలు సురభి వాణి దేవి హాజరయ్యారు. వారి సమక్షంలోనే బ్రాహ్మణ మహిళా సేవ సంఘం సమావేశం నిర్వహించారు. ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన బ్రాహ్మణ విద్యార్థులకు ఆర్థిక సాయంతో పాటు పురస్కారాలు అందజేశారు. బ్రాహ్మణ ఆర్గనైజేషన్ ఫర్ సోషల్ సర్వీస్ (బోస్) కన్వీనర్ బసవరాజ్, శ్రీనివాస్, టీబీస్స్ చైర్మన్ వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ, బీజేపీ సీనియర్ నాయకులు వజ్జా సుధాకర శర్మ, రంగారెడ్డి జిల్లా పీసీసీ కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ డైరెక్టర్ పంతంగి మాధవి, బ్రాహ్మణ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యుల సమక్షంలో బడంగ్ పేట్ నగర బ్రాహ్మణ సేవా సంఘం మహిళా కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షురాలు ఆకెళ్ళ అనురాధ, అధ్యక్షురాలిగా సుధారాణి కృష్ణంరాజు. ప్రధాన కార్యదర్శిగా మైథిలి, ఉపాధ్యక్షులు మందా రాజేశ్వరి, నవీన జ్యోతి, తుమ్మూరు గోటి ఇందిరా, కార్యదర్శులు చౌడ్రాజు శిరీష, రాంబట్ల పద్మావతి, తదితరు సభ్యులను ఎమ్మెల్సీ సురభి వాణి దేవి సన్మానించారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా స్వతంత్రంగా నిలబడడానికి ప్రయత్నం చేయాలన్నారు. అన్ని రంగాలలో బ్రాహ్మణ మహిళలు రాణించే విధంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

వీరభద్రీయ సంఘం నూతన కార్యవర్గం

మలక్ పేట, జూన్ 23: వీరభద్రీయ (వీరముష్టి) సంఘం కేంద్ర కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ముసారాంబాగ్‌లోని కేంద్ర సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కేంద్ర సంఘం అధ్యక్షుడు కాటపల్లి వీరస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశానికి సంఘం జాతీయ అధ్యక్షుడు కాటపల్లి రాజేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్రం నలుమూలల నుంచి 70కి పైగా అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్న ఈ సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నికల కమిటీ చైర్మన్‌గా పొన్నాల నరహరి వ్యవహరించగా, జిల్లా, స్థానిక సంఘాల ప్రతినిధులతో కూడిన ఎన్నికల కమిటీ సమన్వయంతో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేసింది. కేంద్ర కమిటీ అధ్యక్షుడిగా చెవ్వ కొండయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా కాటపల్లి భిక్షపతి, మిట్టపల్లి పోచయ్య, ప్రధాన కార్యదర్శిగా చెవ్వ శ్రీనివాస్, కోశాధికారిగా కాటపల్లి రవికుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కొండయ్య, శీనివాస్ మాట్లాడుతూ తమపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తామని, కుల అభివృద్ధికి కృషి చేస్తామని వారు అన్నారు. త్వరలో పూర్తి కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి, కేంద్ర సంఘం విధి విధానాలను ఖరారు చేస్తామని, రాష్ట్రవ్యాప్తంగా అన్ని అనుబంధ సంఘాల ప్రతినిధులతో కలిసి కుల అభివృద్ధి కోసం నిరంతరం పాటు పడతామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అనుబంధ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ఎడ్యుకేషన్ కమిటీ, జాతీయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను సకాలంలో పూర్తి చేయాలి

గ్రామసభలో మాట్లాడుతున్న ఎండీఓ సరిత

కందుకూరు, జూన్ 23 : విధుల్లో పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని ఎండీఓ ప్రత్యేక అధికారి సరిత తెలిపారు. మండల పరిధిలోని కొత్తగూడ గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రామ సభలో పాల్గొని ఆమె మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారు ఈనెల 25వ తేదీ లోపు నిర్మాణ పనులను ప్రారంభించాలని సూచించారు. లేనిపక్షంలో రద్దు చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. వారం రోజులు పాటు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అంగన్‌వాడీ పక్కా భవనం లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, 1991లో నిర్మించిన బీసీ కమిటీ హాల్లో కొనసాగడం పట్ల పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అందుకోసం అమెజాన్ సంస్థ అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించడం కోసం ముందుకు వచ్చిందని, గ్రామస్తులందరితోపాటు వివిధ పార్టీల నాయకులు సమష్టిగా స్థలం చూపినట్లయితే నిర్మాణ పనులను చేపట్టడానికి ముందుకు వస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులందరికీ ఆమోదయోగ్యంగా ఉన్నచోట నిర్మిస్తామని తెలిపారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండొద్దని పేర్కొన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి, మాజీ సర్పంచ్ సాద మల్లారెడ్డి, ఏఈ ఓ.రాజు, తిరుపతి రావు, కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నరసింహారెడ్డి, నాయకులు బొక్క సంజీవరెడ్డి, సాడపు శేఖర్ గౌడ్, దేవేందర్ రెడ్డి, దామోదర్ రెడ్డి, కృష్ణయ్య, బీఆర్ఎస్ పార్టీ నాయకులు సామ ప్రకాశ్ రెడ్డి, మండల సోషల్ మీడియా కన్వీనర్ బొక్క దీక్షిత్ రెడ్డి, బాలేష్ ముదిరాజ్, అరవింద్ రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ తల్లోజు సరస్వతి, ఆశ వర్కర్ చీమల అనిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

గడ్డి అన్నారం డివిజన్‌లో

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

గడ్డిఅన్నారం డివిజన్‌లో నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, తదితరులు

ఎల్బీనగర్, జూన్ 23: రాబోవు వర్షాకాలం యందు ప్రజారోగ్యం, పారిశుధ్య విషయమై ఎదురయ్యే సమస్యలను దృష్టిలో ఉంచుకొని జీహెచ్ఎంసీ కమిషనర్‌ఆదేశాల మేరకు అన్ని సర్కిళ్ల యందు ముందస్తు వర్షాకాల ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించినందున, అందులో భాగంగా సోమవారం గడ్డి అన్నారం డివిజన్‌లోని వీవీ నగర్ వద్ద కార్యక్రమాన్ని కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఇందులో భాగంగా లలితానగర్, మధురాపురి, శ్రీకృష్ణ నగర్, ప్రగతి నగర్, సాహితీ నగర్, న్యూ గడ్డి అన్నారం, పటేల్ నగర్ యందు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కాలనీల రోడ్లను, ఖాళీ ప్రదేశాలను శుభ్రం చేసి ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి చెత్తను ఎత్తి వేయించారు. ఈ కార్యక్రమంలో సరూర్ నగర్ సర్కిల్ పారిశుధ్య విభాగం అధికారిణి డీఈ చందన చౌహాన్, శానిటరీ సూపర్వైజర్ బుచ్చయ్య, ఎస్ఎఫ్ఏలు, జవాన్లు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, మూడు రోజులు పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలియజేశారు.

ఇళ్ల నుంచి, వ్యాపార స్థలాల నుంచి వెలువడే చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ పడవేయకుండా జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన స్వచ్ఛ ఆటో వారికి అందించాలని, ఎక్కడపడితే అక్కడ పడవేయడం వలన వర్షాకాలంలో నాలాలు, మోరీలు చెత్తతో నిండిపోయి, వర్షం నీరు కాలనీలలో నిలిచిపోయి దుర్వాసన, ప్రాణాంతకమైన అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలందరూ ఈ సూచనలను పాటించాలన్నారు.

ఇంటి పరిసరాలలో నీరు నిల్వకుండా చూసుకోవాలని, దోమలు అభివృద్ధి చెందకుండా మన వంతు బాధ్యతగా ఉండాలని తెలియజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, జూన్ 23: విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆస్మాన్ ఘ డ్ సబ్ డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో మంగవారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు అస్మాన్ ఘడ్ డీఈ విష్ణువర్ధన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఆర్య సమాజ్, 11కేవీ ధోబీఘాట్, 11కేవీ ఆంధ్రా బ్యాంక్ కాలనీ, 11కేవీ మూత్రుజా నగర్, 11కేవీ ఆశ్రప్ నగర్, 11కేవీ డ్రైలాండ్, 11కేవీ ఈది బజార్ ఫీడర్ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, 11కేవీ ఏసీపీ ఆఫీస్, 11కేవీ ఏకలవ్య నగర్, 11కేవీ శంకేశ్వర్ బజార్, 11కేవీ పూర్ణోదయ కాలనీ, 11కేవీ సదత్ నగర్, 11కేవీ బడా బజార్, 11కేవీ జయ నగర్, 11కేవీ జ్యోతి బాగ్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ఆయా ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలతో పాటు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

సైదాబాద్, జూన్ 23: ఐఎస్ సదన్ డివిజన్ వైశాలీ నగర్ కాలనీలో 10 లక్షల 10 వేల రూపాయలతో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం కార్పొరేటర్ జంగం శ్వేత ప్రారంభించారు. ఈ